**జరిగిన కథ :** మధిర సుబ్బన్న దీక్షితులు కాశీమజిలీ కథలను.. మణిసిద్ధుడనే యతి, తన సహాయకుడైన గోపాలకుడికి చెప్పినట్లుగా రచించారు. ఒకచోట బంగారు ఎలుకను పూజించే వైశ్యుణ్ని చూశాడు గోపాలకుడు. 'ఎలుకను పూజిస్తున్నావెందుకు?' అని అడిగితే.. 'ఇది మా వంశాచారం. ఎందుకు ఏర్పడిందో నాక్కూడా తెలియదు' అని సమాధానం ఇచ్చాడా వర్తకుడు. మణిసిద్ధుడు తన వద్దనున్న మణి సహాయంతో ఆ కథను గోపాలకుడికి చెప్పాడు.

# విగ్రహంలో విద్యాధర

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

ఉజ్జయినిలో కుమారదత్తుడనే వైశ్యుడు న్యాయబద్ధమైన వాణిజ్యం చేస్తుండేవాడు. వివాహమైన చాలాకాలానికి అతని భార్య రమాదత్త గర్భవతి అయింది. కానీ, ఆమెకు ప్రసవం కాకముందే కుమారదత్తుడు కన్నుమూశాడు. జ్ఞాతులు అతని సంపదనంతా అపహరించారు. దారిద్ర్యపీడను అనుభవిస్తున్నా.. తన కుమారుడికి ఏ లోపమూ రాకుండా పెంచుతున్నది రమాదత్త.

పిల్లవానికి మదనాంకుడని పేరుపెట్టి, వాణిజ్యానికి అవసరమైన చదువు చెప్పించ సాగింది. కాలగతిలో వానికి ఈడు వచ్చింది.

'ఇంకా ఎన్నాళ్లు తల్లిని ఇబ్బంది పెడతావు? ఏదైనా వృత్తి చేసుకుని, జీవనం గడుపుకో' అని తెలిసినవాళ్లంతా చెప్పసాగారు. కానీ, మదనాంకుడికి ఆ మాటలు చెవికి ఎక్కేవి కావు. ఆకతాయితనంతో ఊరంతా తిరిగేవాడు. యవ్వనవిలాసాలు అతని హృదయాన్ని ఆక్రమించాయి. అద్దంలో చూసుకుని, మీసాలు దువ్వుకుంటూ, కన్నులు చిట్లిస్తూ ఏకాంతంలో వెర్రివికారాలు పోతుండేవాడు.

ఒకనాడు మదనాంకుడు మహాకాళుని ఆలయానికి వెళ్లాడు. దేవతాదర్శనం కోసం వచ్చిన యువతుల సౌందర్యచాతుర్యాలను వర్ణిస్తూ చాలాసేపు అక్కడక్కడే తిరిగాడు. కొంతసేపటికి జనాలు పల్చబడ్డారు. ఇంకా అక్కడే ఉన్న మదనాంకుణ్ని.. ముఖమండపంలో ఒక సుందరమైన విద్యాధర కన్యక విగ్రహం ఆకర్షించింది. ఆ విగ్రహాన్ని తనివితీరా చూస్తూ, మోహావేశం పట్టలేక కౌగిలించుకున్నాడు.

యాదృచ్ఛికంగా అంతకుముందే రాగవతి అనే విద్యాధర కన్య ఒకామె ఆలయానికి వచ్చింది. స్వామిని అర్చించిన అనంతరం మంటపంలో విగ్రహాన్ని చూసి, తన విద్యామహిమ చేత ఆ విగ్రహాన్ని ఆవేశించి, దానిలో విశ్రాంతి తీసుకోసాగింది.

మదనాంకుడు ఆ విగ్రహాన్ని కౌగిలించి, ముద్దుపెట్టుకోబోతుండగా.. దానిలో ఆవేశించి ఉన్న రాగవతి.. రత్నకంకణాలతో అలంకరించి ఉన్న తన చేతిని బయటికి తీసి అతని బుగ్గ గిల్లింది.

మదనాంకుడు చటుక్కున ఆ చెయ్యి పట్టుకున్నాడు.

అప్పుడు రాగవతి అతనికి కనిపించకుండానే..

''మహాభాగా! నేను అపరాధిని. నా తప్పు క్షమించు. నా చేయి విడిచిపెట్టు'' అన్నది.

''నువ్వెవరో కనిపించకుండానే మాట్లాడుతున్నావు. కనిపిస్తేనే కదా.. క్షమించడం'' అని పలికాడు మదనాంకుడు.

అప్పుడు రాగవతి తన యదార్థరూపంతో అతనికి దర్శనమిచ్చింది. ఆమె భూషణాల కాంతులు కన్నులకు మిరుమిట్లు గొలుపుతుండగా.. ఆమె సౌందర్యాతిశయాన్ని చూసి విభ్రాంతుడయ్యాడు మదనాంకుడు.

అప్పుడామె..

''సుందరుడా! నేను విద్యాపరుడనే విద్యాధర చక్రవర్తి కూతురిని. నాపేరు రాగవతి. హిమాలయాలకు సమీపంలోని పుష్కరావతి మా నగరం. ఈ విగ్రహంలో మా కులానికి చెందిన కన్యకారూపం ఉండటం చూసి, అదృశ్యరూపంగా ఇందులో విశ్రాంతి తీసుకుంటున్నాను. అంతలో నువ్వు వచ్చావు. కేవలం ఒక విగ్రహాన్ని చూసి నువ్వు మోహించగా లేనిది.. మదనుని మోహనాస్త్రంలా కనిపిస్తున్న నిన్ను నేను

